# అంతరంగనాథుడు

మదరాసు నుండి శ్రీరంగం ప్రయాణ మయ్యాను. రంగనాథుడ్ని దర్శిద్దామనే తపన.

రిజర్వేషన్ దొరకలేదు. జనరల్ బోగీ. జనం కిటకిటలాడుతున్నారు. రైల్వే కూలీకి ఐదు రూపాయిలు సమర్పించుకుని మెల్లగా ఓ సీటు సంపాదించాను.

రైలు కదిలింది. గాలి వీచింది.

ఒకరిచేతుల్లోని మేగజైన్లు ఒకరు అడిగి తీసుకోడం, ఎవరు ఏయే ఊళ్ళు వెళుతున్నారని అడిగి తెలుసుకోడం జరుగుతూంది.

టికెట్ కలెక్టరు వచ్చాడు.

అందరూ టికెట్లు చూపించారు. నేను మాత్రం పాస్ చూపించాను. మా అబ్బాయి, రైల్వే ఎలెక్ట్రికల్ ఫోర్మన్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. వాడికి డిపెండెంట్ ఫాదర్‌గా నా ప్రయాణం.

కంపార్టుమెంటంతా చెక్ చేసుకుని టికెట్ కలెక్టరు దిగిపోయాడు.

మళ్ళీ రైలు కదిలింది.

సందట్లో సడేమియా అనుకుని, ఒక వ్యక్తి ఇంకొక ప్రయాణికుని జేబులో చెయ్యి పెట్టి పర్సుతీశాడు.

"దొంగ దొంగ పట్టుకోండి" అని అరచాను. పర్సుతో సహా దొంగను పట్టుకున్నారు. నలుగురూ నాలుగు చేతుల్తోనూ యథాశక్తి చితకబాదారు. పక్క స్టేషన్‌లో రైల్వే పోలీసులకి ఆ దొంగను అప్పజెప్పాం.

మళ్ళీ రైలు కదిలింది.

శ్రీరంగం చేరాను.

కావేరీ నదిలో స్నానం చేసి, శుచిగా, స్వామి దర్శనార్థం- చేతులు జోడిస్తూ - గర్భాలయంలో అడుగు పెట్టాను.

జగద్విఖ్యాత పురాతత్వ శాస్త్రవేత్త డాక్టరు ఆనందకుమారస్వామి "ఈ జగత్తు అనే నాటక రంగానికి ప్రభువు రంగనాథుడు. నాటక రంగం మీద నాట్యం చేసేవాడు, పరమశివుడైన నటరాజు. ఈ యిద్దరూ లేకపోతే సృష్టే లేదు!" అని వ్యాఖ్యానించారు.

ఓహో! ఇటువంటి రంగనాథుడినా నే దర్శించబోయేది?

స్వామి విగ్రహానికి నమస్కరిస్తూనే వున్నాను. గానీ, మనసు నిలకడగా లేదు. కారణం- నేనింకొకరి పాసుమీద ప్రయాణం చెయ్యడం. నా కుమారులెవరూ రైల్వే ఉద్యోగులు కారు. ఇంకొక రైల్వే ఉద్యోగి అయిన ఓ యువకుడు, తన మీద ఆధారపడ్డ తండ్రి, శ్రీరంగం వెళుతున్నట్టుగా పాసు తీసుకుని నాకిచ్చాడు. ఆ రైల్వే ఉద్యోగి తండ్రిగా నేను ప్రయాణమయాను.

మనలో చాలా మందికి ఒక అపోహ వుంది. కంటికి కనిపిస్తుండగా దొంగతనం చేసినవాడు కాని, దొంగతనం చేస్తుండగా పట్టుబడినవాడుకాని దొంగ అని.

నేనంటే ఆ దొంగను పోలీసులకు అప్పజెప్పాను కాని, నా మాటేమిటి? తప్పుడు పాసుమీద ప్రయాణం చెయ్యడం 'దొంగ'తనం కాదా?

ఈ విషయం రాతి విగ్రహ రూపంలో వున్న రంగనాథుడికి తెలుసునో లేదో కానీ, నా అంత 'రంగనాథుడి'కి తెలుసు కదా?

• ఆంధ్రజ్యోతి వీక్లీ •
*9-8-1989*